పెండ్లి చేసుకుంటానని.. గర్భవతిని చేశాడు..

బలవంతంగా అబార్షన్స్.. నిలదీస్తే చిత్రహింసలు

యువతి ఫిర్యాదు.. కేసు నమోదు

బంజారాహిల్స్, మే 21: ఓ యువతిని ప్రేమిస్తున్నానంటూ నమ్మించాడు.. పెండ్లి చేసుకుంటానని శారీరకంగా వాడుకున్నాడు ఓ యువకుడు. దీంతో ఆ యువతి గర్భం దాల్చడంతో నా ఇష్టానికి వ్యతిరేకంగా మూడుసార్లు అబార్షన్ చేయించాడు. పెండ్లి కోసం ఒత్తిడి చేయడంతో విచక్షణా రహితంగా దాడి చేయడంతోపాటు ఇంట్లో నుంచి తరిమివేశాడు. న్యాయం కోసం పోలీసులను ఆశ్రయిస్తే రాజీ చేసుకోవాలని ఒత్తిడి తెచ్చారంటూ ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదుతో ఫిలింనగర్ పోలీసులు అర్చిత్ పసుపులేటి అనే యువకుడితో పాటు అతడికి సహకరించిన ఇద్దరి స్నేహితులపై కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఫిలింనగర్ సమీపంలోని సినోర్ కాలనీలో నివాసం ఉంటున్న అర్చిత్ పసుపులేటి (28) సాఫ్ట్‌వేర్ సంస్థ డైరెక్టర్‌గా ఉన్నాడు. అతడికి కామన్ ఫ్రెండ్స్ ద్వారా రెండేళ్ల కిందట యువతి(24) పరిచయమైంది. ఆ పరిచయం కాస్త ప్రేమగా మారడంతో పెండ్లి చేసుకుంటానని నమ్మించిన అర్చిత్ ఆమెను లోబర్చుకున్నాడు. కాగా, యువతి గర్భం దాల్చడంతో అబార్షన్ చేయించాడు. పెండ్లి విషయంపై నిలదీయగా కొంత సమయం ఇవ్వాలని కోరేవాడు. ఇలా మరో రెండుసార్లు ఆమెకు బలవంతంగా అబార్షన్స్ చేయించడంతో ఆరోగ్యంపై ప్రభావం పడింది. దీంతో అర్చిత్ మరో యువతితో సన్నిహితంగా ఉండటం మొదలుపెట్టాడు. విషయం తెలుసుకున్న యువతి ఫిబ్రవరి 20వ తేదీన అతడి ఇంటికి వెళ్లి నిలదీయగా.. అతడి కుటుంబసభ్యులు ఆమెను వెళ్లగొట్టారు. అనంతరం తాను ఆత్మహత్య చేసుకుంటానని యువతి బెదిరించగా.. అర్చిత్ ఆమెపై దాడి చేయడంతో పాటు స్నేహితులు కావ్య, ఆదిత్య వద్దకు తీసుకువెళ్లి అవహేళన చేశాడు. దీంతో ఆమె ఫిబ్రవరి 24న ఇంట్లో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయడంతో అక్కడి నుంచి అర్చిత్ ఇంటి వద్దకు రావడంతో తరిమివేశారు. ఫిలింనగర్ పోలీసులు అక్కడికి చేరుకుని ఆమెను అపోలో ఆస్పత్రిలో చేర్చారు. రెండ్రోజుల తర్వాత ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన బాధితురాలు ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు అర్చిత్ కుటుంబసభ్యులను పీఎస్‌కు పిలిపించారు. ఫిర్యాదు వెనక్కి తీసుకోవాలని, తిరిగి అర్చిత్ వద్దకు రానంటూ కొన్ని కాగితాలపై సంతకాలు చేయించుకున్నారు. బాధితురాలు మంగళవారం రాత్రి ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. అర్చిత్ పసుపులేటితోపాటు అతడికి సహకరించిన స్నేహితురాలు కావ్య పొట్లూరి, ఆదిత్య సయ్యపరాజుపై బీఎన్ఎస్ 69, 79, 351(3) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అధిక లోడ్.. నాణ్యత లోపం

- లోడ్‌కు మించిన వినియోగంతో ప్రమాదాలు
- స్తంభాల వద్ద కుప్పలుతెప్పలుగా వైర్లు
- తనిఖీల్లో అలసత్వం.. అందని నివేదికలు
- గుల్జార్‌హౌస్‌పై కొనసాగుతున్న దర్యాప్తు

సిటీబ్యూరో, మే 21(నమస్తే తెలంగాణ): నగరంలో జరిగే అగ్ని ప్రమాదాల్లో చాలా వరకు షార్ట్ సర్క్యూట్‌తోనే జరుగుతున్నాయని ప్రాథమికంగా అధికారులు అంచనా వేస్తున్నారు. భవనాల్లో వాడే విద్యుత్ పరికరాలు నాణ్యతగా లేకపోవడంతో ఈ ప్రమాదాలు జరుగుతున్నట్లుగా తెలుస్తున్నది. వేసవి కాలంలో గ్రేటర్‌లో ఒక్క నెలలో పదికి పైగా ప్రమాదాలు జరిగితే అగ్ని ప్రమాదాలపై నివేదిక ఇవ్వాల్సిన విద్యుత్ తనిఖీ శాఖ(సీఈఐజీ) పెద్దగా దృష్టి పెట్టడంలేదు. రెండు మూడు ప్రమాదాలపై నివేదిక ఇచ్చి చేతులు దులుపేసుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి. తనిఖీల్లో ఆలస్యం, అలసత్వం కారణంగా ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అధికార యంత్రాంగం, ఘటనలు జరిగిన రెండు మూడురోజులు హడావుడి చేసి ఆ తర్వాత ఆ సంగతే మరిచిపోతున్నారు. ఈ ప్రమాదాల్లో అధికంగా భవనాల్లో అంతర్గత వైరింగ్ సరిగా లేకపోవడం, లోడ్‌కు మించిన విద్యుత్ వినియోగంతో జరుగుతున్నట్లుగా అధికారులు చెప్పారు. గుల్జార్‌హౌస్ వద్ద జరిగిన అగ్ని ప్రమాదానికి కూడా ఇవే ప్రాథమిక కారణాలుగా సిబ్బంది చెప్పారు. స్తంభాల వద్ద కుప్పలుగా ఉన్న వైర్లు, చేతికి అందే ఎత్తులో ఉండటం, ప్రతి భవనంలో వినియోగించే విద్యుత్ కంటే అధిక లోడ్ ఉండటంతో అగ్ని ప్రమాద ఘటన చుట్టు పక్కల ఉన్న షాపులన్ని ఇవే తరహాలో ఉన్నాయి. విద్యుత్ శాఖ క్షేత్రస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేసి ఆ ప్రాంతంలో ఉన్న కనెక్షన్లు, అక్రమంగా తీసుకుంటున్న లోడ్‌పై వివరాలు కావాలని కోరినట్లు తెలిసింది.

తనిఖీల్లో విఫలం..!

గ్రేటర్ హైదరాబాద్ కేంద్రంగా ఎస్‌పీడీసీఎల్ పరిధిలో 60 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. హైదరాబాద్ సెంట్రల్ పరిధిలోకి వచ్చే సుమారు ఏడు లక్షల కనెక్షన్లు ఉన్నాయి. సరైన సమయంలో నివేదికలు ఇవ్వకపోగా.. ప్రమాదాల నియంత్రణలో కీలకమైన విద్యుత్ తనిఖీ శాఖ పూర్తిగా విఫలమైందని ఆ శాఖ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. ముఖ్యంగా సీఈఐజీకి సంబంధించి ముఖ్య అధికారులు లేకపోవడం, ఒక్కరికే పలు రకాల బాధ్యతలు ఉండటంతో అసలు పట్టింపే లేకుండా పోతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యుత్ పరికరాల నాణ్యత, కేబుల్స్ వినియోగం, అంతర్గత విద్యుత్ లైన్లు, ఏబీ స్విచ్‌లు, ఎర్తింగ్ సిస్టమ్ వంటివి పక్కాగా ఉన్నయా?లేవా చూడాలి. క్షేత్రస్థాయిలో లైన్ ఇన్‌స్పెక్టర్లు వీటిపై దృష్టి పెట్టకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. భవనాల్లో లెక్కకు మించి ఏసీల వినియోగం విద్యుత్ ప్రమాదాలకు కారణమవుతున్నది. గుల్జార్‌హౌస్ వద్ద జరిగిన అగ్ని ప్రమాదంలో 14 ఏసీలు వాడటం, వీటిలో ఏసీ కంప్రెషర్ పేలిపోవడం వల్ల ప్రమాదం జరిగినట్లుగా అధికారులు చెప్పారు. పాతబస్తీ అగ్ని ప్రమాదానికి కారణమేంటనే దిశగా పోలీసుల దర్యాప్తు కొనసాగుతున్నది.

శ్రావణ్ కస్టడీపై

ముగిసిన వాదనలు

నేటికి తీర్పును రిజర్వు చేసిన కోర్టు

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, మే 21(నమస్తే తెలంగాణ): ఓ మీడియా సంస్థ ప్రతినిధి శ్రావణ్‌కుమార్‌ను కస్టడీకి అప్పగించాలని కోరుతూ సీసీఎస్ పోలీసులు దాఖలు చేసిన పిటీషన్‌పై ఇరువైపులా వాదనలు ముగిశాయి. తీర్పును గురువారానికి రిజర్వు చేస్తూ 12వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏడురోజులపాటు పోలీసు కస్టడీకి ఇవ్వాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ బుధవారం వాదనలు వినిపించారు. విచారణ కొనసాగించేందుకు నిందితుడిని అప్పగించాలని కీలక సమాచారాన్ని, సాక్షాధారాలను జప్తు చేసి కోర్టుకు సమర్పించాల్సి ఉందని పీపీ తెలిపారు. రూ.6,58,47,883 కోట్ల డబ్బును ఆఖండ్ ఇన్ఫ్రాటెక్ ఇండియా ప్రై.లి.కు డబ్బులు చెల్లించకుండా, ఇనుప ఖనిజాన్ని కూడా సరఫరా చేయకుండా మోసం చేశాడన్నారు. ఫిర్యాదు దారుడు ఏ.ఆకర్షక్రిష్ణ సీసీఎస్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదులో పేర్కొన్నారని వివరించారు. ఈ కేసులో ఉన్న మిగతా నిందితులు ఉమామహేశ్వర్‌రెడ్డి(అకోర్ ఇండస్ట్రీస్ ప్రై.లి కంపెనీకి పూర్తిస్థాయి డైరెక్టర్), కెబీ.వేదమూర్తి(సదరు కంపెనీ ప్రతినిధి), శ్రావణ్ భార్య అరువేల స్వాతి(అకోర్ ఇన్‌రిథమ్ ఎనర్జీ కంపెనీ) పరారీలో ఉన్నారని, వారి గురించి పూర్తిస్థాయి సమాచారం సేకరించాల్సి ఉందన్నారు. విచారణ పూర్తి అయిన తర్వాతనే పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించారని నిందితుడి తరపు న్యాయవాది అభ్యంతరం తెలిపారు.

నాగ్‌పూర్ నిపుణుల విచారణ

గుల్జార్‌హౌస్ వద్ద అగ్నిప్రమాదంపై విచారణ

కీలక ఆధారాలు సేకరించిన ఫోరెన్సిక్ టీమ్

సిటీబ్యూరో, మే 21(నమస్తే తెలంగాణ):గుల్జార్‌హౌస్ చౌరస్తాలోని శ్రీకృష్ణ పెరల్స్ భవనంలో జరిగిన అగ్ని ప్రమాదంపై నాగ్‌పూర్ నిపుణుల బృందం విచారణ చేపట్టింది. బుధవారం పాతబస్తీకి వచ్చిన నిపుణులు భవనంలో అణువణువూ పరిశీలించారు. అసలు అగ్ని ప్రమాదం జరగడానికి కారణాలేంటనే దిశగా ఆరా తీశారు. 17 మంది మృతి చెందిన నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులు చనిపోవడం, ఈ ప్రమాదానికి కారణాలపై ప్రభుత్వ శాఖలు భిన్నవాదనలు వినిపిస్తున్న నేపథ్యంలో నాగ్‌పూర్ బృందంతో విచారణ మొదలుపెట్టారు. ప్రమాదానికి షార్ట్‌సర్క్యూట్ కారణమా.. ఏసీ కంప్రెషర్ పేలడం వల్ల ప్రమాదం సంభవించిందా? ఓవర్‌లోడ్‌తో మీటర్‌లో స్పార్క్‌లు వచ్చి పక్కనే ఉన్న చెక్కలకు అంటుకోవడం వల్ల ప్రమాదం జరిగిందా? ఇలా పలు కోణాల్లో దర్యాప్తు కొనసాగుతున్నది. నాగ్‌పూర్ నిపుణులు, ఫోరెన్సిక్, ఫైర్, విద్యుత్ అధికారులతో చర్చించారు. భవనంలో కొన్ని క్లూస్ సేకరించి వాటిని భద్రపరిచారు. మంగళవారం ఫోరెన్సిక్, క్లూస్ టీమ్స్ కొన్ని ఆధారాలను సేకరించగా.. బుధవారం నాగ్‌పూర్ బృందం మరికొన్ని కీలక ఆధారాలు సేకరించినట్లు సమాచారం. భవనం మంటల్లో మసై పోగా.. మిగతావాటిని పోలీసులు అగర్వాల్, మోడీ కుటుంబసభ్యులకు అందించారు. కుటుంబసభ్యులతో తాము మాట్లాడినప్పటికీ మృతులకు సంబంధించిన కర్మ కార్యక్రమాలు జరుగుతున్నందున పూర్తిస్థాయిలో విచారించలేకపోయామని, వారు కొంత సమయం తర్వాత మాట్లాడుదామని చెప్పారని పోలీసులు చెప్పారు. అగ్నిప్రమాదంలో ప్రాణాలతో బయటపడిన నలుగురు కూడా అదే కుటుంబానికి చెందిన వారని, వారు ఎలా బయటపడ్డారనేది కూడా విచారించామని, ప్రమాదం జరగడానికి కారణాలపై కూడా వారితో మాట్లాడినట్లు పోలీసులు చెప్పారు. ప్రస్తుతం ఈ ఘటనకు సంబంధించి దర్యాప్తు చేస్తున్న ప్రభుత్వ శాఖల అభిప్రాయాలు ఎలా ఉన్నా.. నాగ్‌పూర్ బృందం ఇచ్చే నివేదిక కీలకంగా మారనున్నదని పోలీసులు పేర్కొన్నారు. ఈ ప్రమాదం ఎవరైనా కావాలని చేశారా?అనే కోణంలో మొదట్లో కొన్ని అనుమానాలు తలెత్తాయని, కుటుంబసభ్యులతో తాము మాట్లాడిన తర్వాత అలాంటివేమీ లేదని నిర్ధారణకు వచ్చామని పోలీసులు చెప్పారు.

PUBLIC NOTICE

My client intends to purchase all the property admg. Ac.3.00 guntas in Sy.No.760, at Koheda village, Abdullapurmet Mandal, Ranga Reddy District, from **Smt.Chollety Padmamma,** W/o. late Sesha Chary, Chollety Venkateswarlu, Chollety Devendra Chary, Chollety Narendra Chary, Bala Brahma Chary, and sons of late Sesha Chary, who have been representing that they are absolute owners and possessors of the said agricultural land and there are no claims, litigation on same and their names are also reflecting in Bhu Bharati. Therefore, whoever claiming any rights or disputes on the above said property are directed to bring documents to prove their claims before the undersigned within ten days from the date publication and if no objections are received within the specified time, my client will complete the sale transaction and no claims will be entertained thereafter.

G.VASANTHA RAYUDU
ADVOCATE,
No.16, Surya Complex, Durganagar Colony, Panjagutta, Hyderabad-500 082.
Dt:07.05.2025 Ph : 23402554

ప్రజావాణి ఫిర్యాదులపై కమిషనర్ విచారణ

సిటీబ్యూరో, మే 21(నమస్తే తెలంగాణ): ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించి అక్కడి సమస్యలను పరిశీలించారు. శేరిలింగంపల్లి మండలం గోపన్నపల్లి గ్రామంలోని రంగనాథనగర్‌ను సందర్శించిన రంగనాథ్ ప్లాట్ ఓనర్ల సంఘం ఇచ్చిన ఫిర్యాదుపై స్థానికంగా విచారణ చేపట్టారు. 1985లో 184 ఎకరాల పరిధిలో 850కి పైగా ప్లాట్లతో లేఔట్ వేయగా.. తామంతా ప్లాట్లు కొన్నామని ప్లాట్ల ఓనర్లు రంగనాథ్‌కు చెప్పారు. కొందరు తమ ప్లాట్లను కబ్జా చేసి రహదారులు, పార్కులు అన్నీ కలిపేసి వ్యవసాయ భూమిగా మార్చుకున్నారని, దీనిపై సుప్రీం కోర్టు వరకు వెళ్లామని, మున్సిపల్ అధికారులు కూడా కోర్టు ఆదేశాలను పాటించడం లేదని వారు వాపోయారు. తమ ప్లాట్ల దగ్గర బౌన్సర్లను పెట్టి బెదిరిస్తున్నారని రంగనాథ్‌కు చెప్పారు. వారం పది రోజుల్లో ఇరుపక్షాలను పిలిచి మాట్లాడుతానని, ఇక్కడ ఆందోళన చేయొద్దని ప్లాట్ యజమానులకు చెప్పారు. అంతకు ముందు మేడ్చల్ జిల్లా చెంగిచెర్ల, బోడుప్పల్ ప్రాంతాల్లో పర్యటించిన రంగనాథ్ అక్కడి నుంచి వచ్చిన ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దేవాదాయశాఖ ట్రస్ట్ భూములను ఆక్రమించి ఆ పక్కనే ఉన్న లేఔట్‌ను కబ్జా చేయడానికి మాజీ ఎమ్మెల్యే ప్రయత్నిస్తున్నారంటూ శ్రీమాత అరవింద కాలనీ వాసులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. బోడుప్పల్ గ్రామంలో వికాస్ వెల్ఫేర్ కాలనీలో స్థానికుల ఫిర్యాదును పరిశీలించారు.

గోపన్నపల్లిలో ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

గోపన్నపల్లిలో హౌసింగ్‌బోర్డుకు కేటాయించిన 60 ఎకరాల భూమిలో ఫెన్సింగ్ వేయనివ్వడం లేదంటూ స్థానిక అధికారులు ఫిర్యాదు చేయగా.. కమిషనర్ అక్కడి వారిని విచారించారు. షేక్‌పేటలోని ఓయూ కాలనీలో రోడ్ల అక్రమాలపై ఫిర్యాదు రావడంతో అక్కడి కూడా పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.

టీజేఎఫ్ రజతోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి పొంగులేటి, చిత్రంలో మారుతిసాగర్ తదితరులు

ఖైరతాబాద్, మే 21 : తెలంగాణ జర్నలిస్టుల ఫోరం ఆధ్వర్యంలో ఈనెల 31వ తేదీన నెక్లెస్‌రోడ్‌లోని జలవిహార్‌లో నిర్వహించనున్న రజతోత్సవాల పోస్టర్‌ను బుధవారం మినిస్టర్ క్వార్టర్స్‌లో రాష్ట్ర రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతీసాగర్, టీజేఎఫ్ వ్యవస్థాపక సభ్యుడు ఎ.రమణకుమార్, రాష్ట్ర కోశాధికారి పి.యోగానంద్, సహాయ కార్యదర్శి యార నవీన్ కుమార్, ఐజేయు నేత అవ్వారి భాస్కర్, టీయుడబ్ల్యూజే నగర అధ్యక్ష, కార్యదర్శులు రాకేశ్ రెడ్డి, సోమేశ్, కోశాధికారి వి. బాపు రావు తదితరులు పాల్గొన్నారు.

జూన్ 5 నుంచి 8 వరకు

రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలు

మలక్‌పేట, మే 21: రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ సబ్ జూనియర్, జూనియర్, మెన్, వుమెన్, వెటరన్ టోర్నమెంట్ 2025 పోటీలను జూన్ 5 నుంచి 8వ తేదీ వరకు నాగోల్‌లోని ఉప్పల్ బాగాయాత్ విక్రాంత్ బ్యాడ్మింటన్ అకాడమీ, ఎలైట్ గేమర్స్ గ్యారేజ్‌లో నిర్వహించనున్నట్లు రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ టోర్నమెంట్ కమిటీ ప్రధాన కార్యదర్శి కరెడ్ల శ్రీనివాసరావు తెలిపారు. మినీ సబ్ జూనియర్ విభాగంలో(అండర్ 11 ఇయర్స్) బాల, బాలికల సింగిల్స్, డబుల్స్, సబ్ జూనియర్ విభాగంలో (అండర్ 13 ఇయర్స్) బాయ్స్ అండ్ గర్ల్స్ సింగిల్స్, డబుల్స్, సబ్ జూనియర్ బాయ్స్ అండ్ గర్ల్స్ (అండర్ 15 ఇయర్స్) విభాగంలో సింగిల్స్, డబుల్స్ మిక్స్డ్ డబుల్స్, జూనియర్ విభాగంలో (అండర్ 17 ఇయర్స్) బాయ్స్ అండ్ గర్ల్స్ సింగిల్స్, డబుల్స్, గర్ల్స్ డబుల్స్, జూనియర్స్ (అండర్ 19 ఇయర్స్) విభాగంలో బాయ్స్ అండ్ గర్ల్స్ సింగిల్స్, డబుల్స్, మిక్స్డ్ డబుల్స్, మెన్ అండ్ ఉమెన్, వెటరన్స్ మెన్ అండ్ ఉమెన్ మిక్స్ డబుల్స్ విభాగంలో(35-75 ఇయర్స్) పోటీలు నిర్వహించబడుతాయని ఆయన తెలిపారు. స్పాట్ ఎంట్రీస్ లేవని ఆన్లైన్ ఎంట్రీస్ ద్వారానే జూన్ 2 లోపుగా పేర్లు నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు. సింగిల్స్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు రూ.800, డబుల్స్ పోటీల్లో పాల్గొననే క్రీడాకారులు రూ.1000 ఎంట్రీ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. టోర్నమెంట్ డైలీ షెడ్యూల్ కు సంబంధించిన వివరాలు లింక్:https://btronline.in వెబ్సైట్ ద్వారా తెలుసుకోవచ్చునని ఆయన తెలిపారు. రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ల సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్ పోటీలకు ముఖ్య అతిథులుగా ఆర్ ఆర్ డి బి ఏ టోర్నమెంట్‌సియేషన్ అధ్యక్షులు పుల్లెల గోపీచంద్, కార్యదర్శి శ్రీనివాసరావు, ప్రత్యేక అతిథులుగా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ వికారాబాద్ జిల్లా అధ్యక్షులు కే. లక్ష్మణ్, సంయుక్త కార్యదర్శి యువిఎన్ బాబు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా తదితరులు హాజరుకానున్నారని ఆయన తెలిపారు.

పంటకాలం ముగిసినా అందని రైతుభరోసా

భరోసాపై ఆశలు వదులుకున్న రైతులు

జిల్లాలో రైతుభరోసా అందించాల్సిన రూ. 28 కోట్లు.. అందింది రూ. 6 కోట్లే

మేడ్చల్, మే 21(నమస్తే తెలంగాణ): పంట కాలం ముగిసినా అందని రైతుభరోసాపై రైతులు ఆశలు వదులుకుంటున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా రైతు భరోసాను 42 వేల మంది రైతులకు అందించాల్సి ఉండగా,.. పంట కాలం పూర్తయైన ఇప్పటి వరకు 7,301 మంది రైతులకు మాత్రమే రూ.6,21 కోట్ల రైతు భరోసాను అందించారు. రూ. 28 కోట్లు రైతుభరోసా పథకం కింద అందించాల్సి ఉంది. అయితే యాసంగి పంట కాలం పూర్తయే వానాకాలం పంట సీజన్ దగ్గరికి వస్తున్న రైతుభరోసాను ప్రభుత్వం అందించకపోవడంపై రైతులు నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు. యాసంగి పంటకు సంబంధించి రైతు భరోసాను ప్రభుత్వం అందిస్తుందా లేదా అన్న ప్రశ్న రైతులలో తలెత్తుతుంది. రైతు భరోసా నగదుపై అధికారులను ప్రశ్నిస్తే అధికారుల నుంచి ఎలాంటి సమాదానం రావడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వానకాలం పంటకైనా రైతు భరోసా అందిస్తారా యాసంగి పంట రైతు భరోసాను ఇప్పటి వరకు అందని రైతులు వానకాలం పంటకైన రైతు భరోసాను అందిస్తారా అన్న అనుమనాలను వ్యక్తం చేస్తున్నారు. యాసంగి పంట సాగుకు రైతు భరోసా అందుతుందని ఆశలు పెట్టుకున్న రైతులు అప్పులు చేసి సాగు చేసామని అయితే ఇప్పటి వరకు రైతు భరోసా రాక పోవడంపై ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుబంధు పథకం రైతులు ఎదురు చూసే పని లేకుండా తమ ఖాతాలలో జమ అయ్యేవని ఇప్పుడు అ పరిస్థితి భిన్నంగా మారిందని ఆవేదన చెందుతున్నారు. వానకాలం పంట సాగుకైనా రైతు భరోసాను అందించాలని ప్రభుత్వాన్ని రైతులు కోరుతున్నారు. యాసంగి పంటకు సంబంధించి సన్న వడ్ల నగదుతో పాటు బోనస్ అందించాలని ప్రభుత్వానికి విన్నవించిన బోనస్ డబ్బులను అందించడం లేదని ఆరోపిస్తున్నారు.

చల్లబడ్డ నగరం..

సిటీబ్యూరో : గత కొన్ని రోజులుగా భానుడి ప్రతాపంతో ప్రజలంతా ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. బుధవారం రాత్రి ఒక్కసారిగా వర్షం రావడంతో ప్రజలు పులకించిపోయారు. సాయంత్రం ఒక్కసారిగా వర్షం రావడంతో వివిధ పనుల నిమిత్తం, ఉద్యోగ రీత్యా కార్యాలయాలకు వెళ్లిన వారు ట్రాఫిక్‌తో ఇబ్బంది పడ్డారు.

సర్కారు దవాఖానల్లో తగ్గిన సాధారణ ప్రసవాలు

- జిల్లా ఆసుపత్రి, బార్కాస్ మినహాయించి మిగతా వాటిల్లో సిజేరియన్‌లే ఎక్కువ
- కేసీఆర్ హయాంలో ప్రతి దవాఖానలో పెరిగిన ప్రసవాలు
- కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఎందుకు తగ్గుతున్నాయి?
- సర్వీస్ సెంటర్లకు దూరమవుతున్న గర్భవతులు

సిటీబ్యూరో, మే 21(నమస్తే తెలంగాణ): ప్రభుత్వాసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు పెంచడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి చొరవ చూపడంలేదన్న విషయం తేటతెల్లమైంది. జిల్లాలోని 14 సర్వీస్ సెంటర్లు, ఓ జిల్లా ఆసుపత్రిలో ప్రసవాలు జరగాల్సి ఉండగా, వాటిలో కేవలం బార్కాస్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్, కింగ్ కోటి జిల్లా ఆసుపత్రి మాత్రమే ముందంజలో ఉండగా.. మిగతా ఆసుపత్రుల్లో అనుకున్న స్థాయిలో ప్రసవాలు జరగడం లేదు. గత నెలలో హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న సర్వీస్ సెంటర్లు, కింగ్ కోఠి ఆస్పత్రితో కలిపి 967 ప్రసవాలు జరగగా.. వాటిలో 387 మందికి సిజేరియన్లు జరగడం ఆందోళన కలిగిస్తుంది. సిజేరియన్లు తగ్గించడంలో ప్రభుత్వం, వైద్యాధికారులు ఏ మాత్రం చొరవ తీసుకోవడం లేదన్నది పెరుగుతున్న సిజేరియన్లను చూస్తేనే అవగతమవుతుంది.

మిగతా వాటి పరిస్థితేంటి..?

బస్తీవాసులు, పేద ప్రజలకు సాధారణ ప్రసవాలు, 24గంటలు వైద్యసేవలు అందించేందుకు కేసీఆర్ సర్కారు ఎంతో కృషి చేసింది. అందులో భాగంగానే జిల్లాలో 14 సర్వీస్ సెంటర్లు ఏర్పాటు చేసింది. ఇందులో ప్రసవాలకు కావాల్సిన పరికరాలు, ల్యాబ్‌లు ఏర్పాటు చేసింది. అధికారంలో ఉన్నన్ని రోజులు పేద ప్రజలకు అందిస్తున్న వైద్య సేవల గురించి ఎప్పటికప్పుడు వాకబు చేసింది. గాంధీ, ఉస్మానియా, సుల్తాన్‌బజార్ మెటర్నిటీలకు ప్రసవాల సంఖ్య పెరుగుతుండటంతో సర్వీస్ సెంటర్లలోనే సాధారణ ప్రసవాలు జరిగేలా సిబ్బందిని నియమించింది. నిత్యం ప్రసవాలతో రద్దీగా ఉండే దవాఖానలు నేడు వెలవెలబోతున్నాయి. జిల్లాలోని బొరబండ, అరాజ్‌పెంట, పురునాపుల్-1, యాకత్‌పురా-1, దారుల్‌షిఫా, చార్మినార్, డాక్టర్ పాల్‌దాస్, గగన్ మహల్, బేగంపేట ప్రాంతాల్లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సర్వీస్ సెంటర్లలో గతంలో ప్రసవాలు అనుకున్న స్థాయిలో జరుగుతుండగా.. నేడు అంతంత మాత్రమే జరుగుతుండటం గమనార్హం. గత నెల కింగ్‌కోఠి జిల్లా ఆసుపత్రిలో 160 ప్రసవాల్లో 24శాతం మందికి సిజేరియన్లు జరిగాయి. బార్కాస్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో 60 మందికి ప్రసవాలు జరగగా 23 మందికి సిజేరియన్లు చేశారు. జిల్లాలో సిజేరియన్లు తక్కువగా అయిన వాటిల్లో కింగ్ కోఠి, బార్కాస్‌లు ఉండటం విశేషం. మిగతా వాటిల్లో మాత్రం పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండటం గమనార్హం.

పేరు మార్చి నిలిపేశారు..

సాధారణ ప్రసవాలు పెంచేందుకు కేసీఆర్ సర్కారు గొప్ప ఆలోచనకు శ్రీకారం చుట్టింది. తల్లి బిడ్డల ఆరోగ్యం కోసం కేసీఆర్ కిట్‌ను ప్రవేశపెట్టి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించే వారికి ఉచితంగా కిట్‌ను అందించింది. పేదలకు వరంగా మారిన కేసీఆర్ కిట్ ప్రభుత్వ వైద్య సేవలను గుండెలకద్దుకునేలా చేసింది. ఆ ప్రభావంతో ఆశాలు నెలలో 6 వరకు ప్రసవాల కేసులు నమోదు చేయించి కేసీఆర్ కిట్‌ను అందించేవారు. కాంగ్రెస్ రాకతో కేసీఆర్ కిట్ పేరును మార్చి, ఎంసీహెచ్ కిట్‌గా పేరు మార్చింది. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు ఎంసీహెచ్ కిట్లు ఇవ్వగపోగా, ప్రసవాలు కూడా తగ్గడం గమనార్హం. సర్వీస్ సెంటర్ల లక్ష్యానికి తూట్లు పొడిచే దిశగా ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. గతంలో మాదిరిగానే నెలలో డెలవరీల నమోదు టార్గెట్ ప్రకారం చేయాలని మెడికల్ అధికారులు ఆదేశాలు ఆశాలకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఎంసీహెచ్ కిట్ లేకపోవడం కారణంగా సర్వీస్ సెంటర్లకు వచ్చేందుకు బాధితులు అయిష్టంగా ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

BUSINESS OFFER

★Wanted Investor for Gents Hair Cutting Saloon Business at Hyderabad. Good Returns. Contact: 7075526841, 7075519740. NT-342951

GOLD FINANCE

★మీ బంగారం బ్యాంకుల్లోగానీ, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. Ph: 9100329739. NT-325317

OLD AGE HOME